# వైకుంఠపాళి

డి.కె. చదువుల బాబు

ఇంటిముందు నులకమంచం మీద కూర్చొని ఆకాశంకేసి తదేకంగా చూస్తున్నాడు రాజన్న. మేఘాలమీద రాజన్న చూపులు పారాడుతున్నాయి. వాతావరణం చల్లగా వుంది. వర్షం వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి.

'ఓ వానన్నా రాకపోతుందా?' మనసులో గొణుక్కున్నాడు. అలా అనుకోవడం అప్పటికి ఎన్నోసారో!

మెల్లకన్ను చలమారెడ్డి తాత అటుగా వచ్చాడు. అలికిడికి అటుగా చూసిన రాజన్న ''తాతా, ఈరోజన్నా వానొస్తుందంటావా? పైకి చూసి చెప్పు'' అన్నాడు.

''అందరం ఆమాటే అనుకుంటున్నాంరా అబ్బీ. ఆపై దేవుని దయ. మన చేతుల్లో ఏముంది చెప్పు.'' అన్నాడు ఆకాశంవైపు నమస్కారం పెడుతూ.

''వానపడకుంటే ఎట్టా తాతా, తల్చుకుంటేనే గుబులుగా వుంది.'' అన్నాడు రాజన్న.

''దిగులుపడి చేసేదేందుంది. దేవుణ్ణి నమ్ముకోవటమే'' అంటూ చలమారెడ్డి తాత వెళ్ళిపోయాడు.

''ఒక్క వానొస్తే చాలు, బతుకు గట్టెక్కుతుంది'' ఆకాశంకేసి ఆశగా చూస్తూ పదే పదే అనుకున్నాడు రాజన్న.

మల్లన్న మామ అటుగా వెళ్తూంటే పిల్చాడు రాజన్న.

''ఏం మామా వానొచ్చుందంటావా?'' ఉండబట్టలేక అన్నాడు రాజన్న.

''సూచ్చావుంటే వచ్చేలాగేవుంది. ఆకాసమంతా మసకేసుకోని వుంది. అయినా ఇలా వచ్చి అలా ఎన్నిసార్లు మోసం చేసిపోలేదు'' అన్నాడు మల్లన్న.

రాత్రి అన్నంతిని బొంత సంకన పెట్టుకుని ''మిద్దెమీదికెళ్తున్నా'' అన్నాడు భార్యతో.

''వానొచ్చేలావుంది. తడిసిపోతావు. రోజూలేంది ఈరోజే మిద్దెక్కాలా?'' అంది మంగమ్మ.

''వాన రావడం సూడాలనేగదా మిద్దెక్కుతోంది. వాన రావాలేగానీ తెల్లవార్లూ తడుస్తూ గెంతులెయ్యనూ'' అంటూ బయటకు నడిచాడు.

పైన పడుకుని మేఘాలకేసి ఆశగా చూస్తూండిపోయాడు. కంటిమీద కునుకు లేకుండా ''ఓ వాన కురిపించుసామీ'' అంటూ దేవుణ్ణి వేడుకుంటూనే వున్నాడు. రెండు, మూడు చినుకులు రాలి ఒంటిమీద పడ్డాయి. రాజన్న ఒళ్ళు పులకరించింది.

''వానొస్తోంది, వానొస్తోంది'' మనసు కొట్టుకులాడింది. సంతోషంతో గుండె వేగం పెరిగింది.

ఓ రెండు సెకనులు చినుకులు రాలి ఆగిపోయాయి. ఆగిన చినుకులు రాలుతాయని చూస్తూండిపోయాడు. చూసి చూసి అలసిపోయాడు. ఆకాశంలో నక్షత్రాలు కనిపిస్తున్నాయి. చుక్కల మధ్య శూన్యాన్ని కొలుస్తూ వుండిపోయాడు.

తెల్లవారుఝామున కాకుల అరుపులతో ఉలిక్కిపడి లేచాడు. చుట్టూ చూశాడు. ఆకాశంకేసి చూశాడు. జుట్టు పీక్కున్నాడు. ఒళ్ళు తడుముకున్నాడు. మిద్దెమీది మట్టిని చేతపట్టుకుని పిసికాడు. తడితగల్లేదు.

గబ గబా బొంత మడిచి సంకన బెట్టుకుని కిందకు దిగాడు. గూని గంగన్న అటుగా వస్తూ కనిపించాడు.

''గంగన్న మామా'' పిలిచాడు రాజన్న. గంగన్న ఆగినాడు.

''రాత్రి ఊళ్ళో వానపడలేదుగా మామా. చేలమీద ఏవన్నా పడుంటుందటావా?'' ఆతృతగా అడిగాడు.

''నేనూ అదే ఆలోచిస్తున్నా, వెళ్ళి చూసొద్దాంరా'' అన్నాడు గంగన్న.

బొంత ఇంట్లోకి విసిరేసి వెంట నడిచాడు.

''మేఘం వచ్చినట్లూ వచ్చి ఎక్కడికెళ్ళిపోనాది. చేల మీద కురిసుంటాది'' అనుకుంటూ వేగంగా నడుస్తున్నారు. దారిలో వాన సూచనలు కనపించల్యా. ఆశ చావల్యా.

గమ్యం చేరారు. కళ్ళింతలు చేసుకుని చూస్తూ మట్టిని పిసికి పిసికి చూసినారు. తడి తగల్యా. ఆశ చచ్చింది. మొక్కలవైపు చూశారు. ఎండిపోయున్నాయి. పోయినేడు వాన ఎక్కువై పంట కుళ్ళిపోయినాది. ఈయేడు ఇలా!

''అయిపోయింది మావా, ఈ పంట పండదు'' భోరుమన్నాడు రాజన్న. మట్టిని చేతుల్లోకి తీసుకుని భోరుమని ఏడ్చాడు. ఏడ్చి కళ్ళు గాజుగోళాలయ్యాయి. నీటి చుక్కల్లేని ఎడారులయ్యాయి.

ఓ యేడాదన్నా మంచి పంట రాకపోతుందా అని మళ్ళీ మళ్ళీ సాగుచేసే విక్రమార్కుడు రైతు.

మళ్ళీ సంవత్సరం ప్రత్తిపంట వేశాడు రాజన్న. అప్పుగా మంచి మంచి మందులు తెచ్చి వాడినాడు. ప్రాణాలు ఆ పంటమీదే పెట్టుకున్నాడు. కంటికి రెప్పలా చూశాడు. అయినా కొమ్మల్ని, రెమ్మల్ని తెగులు తగులుకుంది. వెండిలా మెరిసిపోవాల్సిన ప్రత్తి ఉండలు చుట్టుకుపోయింది. రాజన్న గుండె రగిలిపోయింది. బోలెడు డబ్బుపోసి కంపెనీ మందులని తెచ్చి వాడాడు. నకిలీ సరుకనుకోల్యా. వాటితో పురుగు చావల్యా. వెళ్ళి అడిగితే ఏదో చెప్పి తప్పుకుంటారు. ఆ మాట పడనిస్తారా? పండినా, ఎండినా వాళ్ళ బాకీ మాత్రం కట్టాల్సిందే. లేదంటే బజారుకీడుస్తారు. ఏమీ చెయ్యలేని నిస్సహాయత.

రాజన్న మనసు వణికింది. ఆ పంటను చూసుకుని భోరుమని ఏడ్చాడు. భవిష్యత్తుల్లోకి భయం భయంగా చూశాడు. మూడేళ్ళుగా ప్రతియేడూ గురితప్పిన బాణమై భవిష్యత్తుని గాయం చేస్తూంటే వెక్కి వెక్కి ఏడ్చాడు.

ఆలోచనలతో నిద్రలేని రాత్రులు ఎన్ని గడిపాడో?

వ్యవసాయం లాటరీ అయింది.

ఈసారి రాజన్న మళ్ళీ పొలం దున్నాడు. వానలు కురిసి భూమి పదును కాగానే ఎప్పటిలాగే మంచి విత్తనాలు తెచ్చి వేరుశెనగ వేశాడు.

రోజూ పొలం దగ్గరకెళ్ళి చూసి వస్తున్నాడు. భూమిని చీల్చుకుని చిన్న చిన్న మొక్కలు బయటకు తొంగి చూస్తూంటే, వాటిని చూసుకుని మురిసిపోయాడు. రాజన్న కళ్ళలో కోటి కోటి కాంతులు. రోజూ వాటి మంచి చెడ్డలు చూసుకుని వస్తున్నాడు.

ఓరోజు కలుపు మొక్కలు కంటబడ్డాయి. కడుపులో చేయిపెట్టి గెలికినట్లయింది. సోమన్నమామ, సుబ్బమ్మత్తా, రాజమ్మ వదినా, నారాయణన్నకూ విషయం చెప్పాడు. సాయం చేయమన్నాడు. బదులుగా తాను వాళ్ళ పొలంలో పనిచేస్తానన్నాడు. కలుపు మొక్కలన్నీ పీకేయించాడు.

స్వంత పొలం వున్నోడికి ముంచే ధరలతో అప్పివ్వడానికి చాలామంది సిద్ధంగా వుంటారు. మంచి మంచి మందులు అప్పు తెచ్చాడు. చదువుకున్న పుల్లారెడ్డికి, నారాయణరెడ్డికి చూపించాడు. మంచి కంపెనీ మందులని చెప్పినారు. సకాలంలో అవసరమైన చినుకులు పడినాయి. కళకళ లాడుతున్న పంటను చూసుకుని మురిసిపోయాడు. చేలో ఎవరికన్నుయినా పడి దిష్టి తగులుతుందేమోనని దిష్టిబొమ్మను ఉంచాడు.

ఇంటి బయట నులకమంచమేసుకుని కూర్చున్నాడు. పంట గురించి ఆలోచిస్తున్నాడు. ''ఈ ఏడాది మంచి పంట పండుతోంది. అప్పులన్నీ తీరిపోతాయి. బతుకు ఓరకంగా గట్టున పడుతుంది. ముందుగా అప్పులన్నీ తీర్చేయాలి. తర్వాతి సంగతి తర్వాత చూసుకోవచ్చు.''

చింతాకు సుబ్బన్న అటుగా వచ్చాడు.

''ఏంటోయ్ ఈఏడాది నీకు మంచి పంట వచ్చేలా వుంది. చేనుతల్లి కళకళ లాడుతోంది. దేవుడు ఓ సూపు సూసాడు'' అన్నాడు సుబ్బన్న.

ఆ మాటలకు రాజన్న ముసిముసిగా నవ్వుకున్నాడు. సంతోషంతో ఛాతి ఉప్పొంగింది. కళ్ళలో ఆనందపు తడి.

అంతలో పాచిపళ్ళ పీరయ్యా పరుగు పరుగున వచ్చాడు. పీరయ్య చేను రాజన్న చేను పక్కనే.

''రాజన్నా, కొంప మునిగిందన్నా'' ఆయాసప

ఢుతూ అన్నాడు పీరయ్య.

రాజన్న మనసు కీడు శంకించింది.

''ఏ.. ఏమైంది?'' తడబడుతూ అడిగాడు.

''ఇప్పుడే చేనుకాడికెళ్ళి చూసొస్తున్నా. రాత్రి చేలో పందులు పడినట్లున్నాయి. మొక్కల్ని పెకిలించేశాయి'' గడగడా చెప్పాడు.

పీరయ్య గొంతులో ఉద్వేగం, ఆవేదన. రాజయ్య గుండె గుభేలుమంది. హృదయం వణికింది. ప్రాణం విలవిల లాడింది. చివ్వున లేచాడు. ఆ పంట చేతికి రాకుంటే భూమి అప్పుల్లోకి వదులుకోవాల్సిందే. కట్టుబట్టలతో నిలబడాల్సిన స్థితి.

ఆఘ మేఘాలమీద పీరయ్యతో కలిసి చేను కాడికి చేరుకున్నాడు. చేనంతా కలయతిరిగాడు. పందులు కొంతమేరకు మొక్కలు పెకిలించి విత్తనాలు తిన్నాయి. పెద్దగా నష్టంలేదు. పీరయ్య పొలం చాలావరకూ పందుల పాలయింది.

అడవి పందులు చేలమీద పడ్డాయనే వార్త ఊరంతా గుప్పుమంది. ఆ రాత్రికి అంతా జట్లు జట్లుగా పొలం కాపలాకు తయారయ్యారు. ప్రొద్దుక్రుంకగానే అన్నం తిన్నారు. ఈటలు, కట్టెలు తీసుకున్నారు. కొందరు తప్పెటలు, మరికొందరు పాత డబ్బాలు, తుంటకర్రలు, కంబళ్ళు, పెద్ద చేతిలైట్లు తీసుకుని కాపలాకు బయలుదేరారు.

రాజన్న తన పొలం చుట్టుపక్కనోళ్ళందరితో కలిసి కాపలాకెళ్ళాడు. రాత్రంత్రా కాగడాలు వెలిగిస్తున్నారు. కర్రలతో డబ్బాలు ధమధమ మ్రోగిస్తూ, బీడీలు, చుట్టలు కాల్చుతూ రాత్రంతా మేలుకుని వుండిపోయారు.

ఆ ఆత్మలకు పగలు, రాత్రి, ఎండ, వాన, చలి, ఆకలి... అన్నీ ఒక్కటే.

అలా ఒక్కరోజు కాదు, రెండ్రోజులుకాదు.. పంట చేతికొచ్చేవరకూ కంటిమీద కునుకులేదు. క్షణం క్షణం జాగ్రదావస్థ.


రాజన్న పొలంలో శెనక్కాయలు విరగ్గాసినాయి. రాజన్న ఉక్కిరి బిక్కిరయ్యాడు. ఆనందంతో గెంతులు వేసినంత పనిచేసాడు.

శెనకట్టె కళ్లం చేరింది. శెనక్కాయలు కోయటం పూర్తయ్యేవరకూ కళ్లంలో కాపలా పడుకున్నాడు. చెట్ల ఆకులు అలికిడయితే చాలు దొంగలేమోనని లేచి కర్రతో, టార్చిలైటుతో తిరిగేవాడు. కోయటం పూర్తయింది. పంట రాశిని తృప్తిగా చూసుకున్నాడు. ఆనందంతో కళ్ళు సెలయేర్లయ్యాయి.

అతివృష్టి, అనావృష్టి, కలుపు, చీడపీడలు, పందుల బెడద, దొంగలబెడద తప్పుకుని ఒక్కొక్క మెట్టూ దాటి తన కళ్ళముందు నిల్చిన పంట రాశిని పదే పదే కళ్లనిండుగా చూసుకున్నాడు.

ఆఘమేఘాల మీద వెళ్ళి ధరను గూర్చి విచారించాడు. పడిపోయివున్న ధర విని రాజన్న గుండె బరువెక్కింది. అంత తక్కువ ధరకు పంట అమ్మాలనిపించల్యా. కొన్ని రోజులాగితే ధర పెరుగుతుందేమోననే ఆశ మెదిలింది. రెక్కలు ముక్కలు చేసుకొని ప్రాణం పోసి పండించిన పంట తక్కువ ధరకు అమ్మటానికి మనసు గింజుకుంది. ధర పెరిగాలకాని ధర ముందు ఏ వడ్డీ నిలువదు.

పంట దాచడానికి తనకు సరైన వసతిలేదు. స్థలం చాలదు.



ఇంట్లో పురుగుల బాధ. ఎలుకల బెడద. వానొస్తే ఇల్లంతా బుంగలుపడి తడిసిపోతుంది. నిల్వ చేసే వసతి తనకు లేదు. ఏమి చెయ్యాలో రాజన్నకు అర్థంకాలేదు.

ఆ ఊరి వ్యాపారస్థుడు శంభుదాసు సరుకు అనామత్తుకు తీసుకుంటున్నాడని తెలిసింది. శంభుదాసు పదేళ్ళ నుండి వ్యాపారం చేస్తున్నాడు. ఆస్తిపరుడు.

అనామత్తుకు సరుకును తీసుకున్న వ్యాపారస్థుడు సరుకును తనకు నచ్చిన ధరకు అమ్ముకుంటాడు.

వచ్చిన డబ్బును వ్యాపారానికీ, ఇతరత్రా వాడుకుంటాడు. రైతు తనకు సరిపడిన ధర వచ్చినప్పుడు వర్తకుని వద్దకెళ్ళి తాను ఆరోజు ఇచ్చిన పంటకు డబ్బు తీసుకోవచ్చు. ధర పెరగకుంటే సంవత్సరమైనా అలా ఎదురుచూస్తూ వుండాల్సిందే. అవసరమైతే తక్కువ ధరతోనే డబ్బు తీసుకోవచ్చు.

అనామత్తు పద్ధతిలో చాలామంది పంట ఇస్తున్నారు. రాజన్న అలాగే పంట ఇచ్చేశాడు.

పంట ఇచ్చింది మొదలు రోజూ ధర గురించి విచారిస్తున్నాడు. తనకు గిట్టుబాటయ్యే మాత్రం ధర పెరిగితే డబ్బు తీసుకోవాలని ఎదురుచూస్తున్నాడు. ధర పెరగలేదు. కొంతకాలం తర్వాత మెల్లిగా ధర పెరగటం ప్రారంభమైంది. ఇంతలో పిడుగు లాంటి వార్త రాజన్న చెవిన పడింది.

ఆ వార్త...

'శంభుదాసు వ్యాపారంలో చాలా నష్టపోయాడు. ఐ.పి. పెట్టాడు' పంట వేసినోళ్ళంతా శంభుదాసు ఇంటికెళ్లారు. అతని ఆచూకీ లేదు. గుండె కలుక్కుమంది. కలలు భగ్నమై.. కనుకొలకుల్లో చేరిన నీటి బిందువులు నరనరాన్నీ మండిస్తుండగా ఘొల్లుమన్నాడు రాజన్న. గుండెలు బాదుకున్నాడు. రాజన్న లాంటి బక్క రైతులంతా నెత్తీనోరూ కొట్టుకున్నారు.

వేట పులికి సమస్యకాదు. బలైపోయే మేకదే సమస్యంతా!

శంభుదాసు ఆ నియోజకవర్గం నాయకుని వెనకాల చేరాడు. ఆ నాయకుడు శంభుదాసుకు ఆశ్రయమిచ్చాడు. అందరికీ తెలిసేలా అభయమిచ్చాడు. బక్కరైతుల నోట మట్టి పడింది. దొంగ, దొర నోట్లు పంచుకున్నారు. కాలం జరిగింది.

శంభుదాసు నగరంచేరి లక్షలతో వ్యాపారం చేస్తున్నాడు. పెద్దమనిషిగా చెలామణి అవుతున్నాడు.

వీధికీడ్చి ఇంటినీ, పొలాన్ని అప్పులోల్లు లాక్కోగా పరువుపోయిందని వాపోతూ రాజన్న. చావలేక, బతకలేక నాలుగు మెతుకుల కోసం గానుగెద్దులయ్యారు రాజన్న కుటుంబం.

అటువైపు చూస్తే ప్రకృతిని నరికే మనిషి- అలిగిన మేఘం-

ఇటువైపు చూస్తే నకిలీ విత్తనాలు, నకిలీ మందులు-

మరోవైపు చక్రవడ్డీల భ్రమణం-

ఇంకోవైపు నకిలీ మనుష్యులు-

నలువైపులా ఆకలితో మలమల మాడే రాజన్నలు.

రాబందుల రెక్కల ధ్వనులు...

ష్..ష్..ష్.. ష్..ష్...ష్..

★